కల

శ్రీ కస్తూరి లక్ష్మీనారాయణ

తొలికోడి కూసింది. ప్రక్కతోటలోవున్న సావిడి లోని గిత్తల మెళ్ళలోవున్న మువ్వల చప్పుళ్ళు విన్పిస్తున్నాయి. దుగ్గమ్మ పిల్లవాడి ప్రక్కనుంచి లేచి , తడిక తీసుకుని, గుడిసెలోనుంచి బయటకు వచ్చింది. వెలా తేలా పోతున్న చంద్రుడు ఎదురుగా వున్న నిమ్మచెట్టు చాటుకు దిగిపోతున్నాడు. డొంక మీది చింతగుబురులో నుంచి ఏదోపక్షి లేచి, పెద్దగా అరచి, రెక్కలు "టపటపా"కొట్టుకుని, మళ్ళీ ఆకు ల్లోకి వాలిపోయింది. ప్రక్కనే బోరింగు పంపుదగ్గర నిలవవున్న నీళ్ళలోనుంచి యిల కోళ్ళ 'కీచు'మని గోలపెడుతున్నాయి.

అప్పుడే నిద్రమేల్కొన్న వీరన్న బద్ధకంగా ఆవులించి లోపలినుంచే కేకేశాడు, "తెల్లారిపోయి నాదంటే దుగ్గమ్మా! లెగిసేదేంటి?" దుగ్గమ్మ ఒకసారి చుట్టూ చూసి, "మరికోడి గూడ కూసే యాలయిందన్నా. లెగవక పోతే ఎట్టా? తెల్లారే పాలికి సేరద్దా!" అని గుడిసె ప్రక్కనేవున్న కుండ తీసుకుని పంపుదగ్గర నీళ్ళు నింపుకుని తెచ్చి పెట్టింది. పక్కలో వూడి పడిపోయిన తలగుడ్డను చుట్టుకుంటూ బయటకు వచ్చాడు వీరన్న. "నేనట్టా పోయి పచ్చిపుల్ల తెచ్చుకుంటాగాని, ఈలోపట అయెన్నీ సద్దేసి ముల్లెగట్టు. యెల్లిపోదాం"అంటూ కాలిబాటనే వెళ్లిపోయాడు.

డొంకమీద నాగళ్ళు పోతున్న చప్పుళ్ళు, గిత్తల్ని అదిలిస్తున్న కేకలు వినిపిస్తున్నాయి. పలుచగా కురుస్తున్న మంచుకు నిమ్మచెట్లు కదలకుండా జోగుతున్నాయి. అపుడపుడు తోటలమీదనుంచి వస్తున్న గాలిలో నిమ్మవాసనలు సోకుతున్నాయి. దుగ్గమ్మ ఏదో తల్చుకుని ఒకసారి నిట్టూర్చి గుడిసెలోకి పోయింది.

వీరన్న వచ్చేసరికి గుడ్డలన్నీ సర్ది మూటకట్టింది. అతడు వస్తూనే నోట్లో పుల్లపారేసి, ముఖమూ కాళ్ళూ, చేతులు కడుక్కున్నాడు. పైగుడ్డతో ముఖం తుడుచుకుంటూ, "సద్దటం అయిపోయినాదంటే అమ్మాయ్! యిగెల్లి పోదాం" అంటూ లోపలికి వెళ్ళాడు. దుగ్గమ్మ పిల్లవాడికి చీర మడతకప్పి భుజాన వేసుకుంది. వీరన్న పరిచివున్న చాపను చుట్టి చెల్లెలిచేతి కిచ్చాడు. తర్వాత సామానువేసి మూతి కట్టిన గోనె, గుడ్డల మూట బయటకు తెచ్చాడు. పైగుడ్డ చుట్ట చుట్టుకొని తలమీద పెట్టుకొని రెండు మూటలు పైకెత్తుకున్నాడు. "ఇగ పదవే అమ్మాయ్. మూడు కోసులు పోవాల, కొంచెం కాలు సాగోపోతే లాబంలేదు."

దుగ్గమ్మ ముందుకు సాగింది.గుడిసెకు కొంచెం ప్రక్కగా నిలువెత్తు పెరిగి విరగచూస్తున్న గులాబీ పాదునుతిరిగితిరిగిచూస్తూ ముందునడుస్తున్న చెల్లెలిని చూసి గొణుక్కున్నాడు. "రెండు సమచ్చరాల బందం యియ్యాల్టితో పూర్తిగా తెగిపోనాది. ఏనాటికి యాడో......?" తోట గట్టుమీది కాలిబాటనే నడిచి డొంక ఎక్కారు.దుగ్గమ్మ వీరన్నకు కొంచెం వెనకగా నడుస్తూ నిలబడి, తిరిగి తోటలోకిచూసింది. తూర్పున విరిసే వెలుగుకు పాలిపోతున్న వెన్నెలలో దుగ్గమ్మకు గడచిన రెండుసంవత్సరాలు నీడయిచ్చిన

గుడిసె, నిమ్మచెట్టు నల్లగా దయ్యాల్లా కన్పిస్తున్నాయి. ఆమె కళ్ళు నీళ్లతో నిండాయి. "ఇంత బతుకు కలలాగ మాయమయిపోనాదేటి?" అనుకుంటే గుండెల్లో చిక్కబట్టినట్లనిపించింది.

ముందు నడుస్తున్న వీరన్న ఆగి వెనుకకు తిరిగాడు. "యింకా అట్టా ఎంతసేపు సూసుకున్నా బాదే కదమ్మాయ్. బాదపడి సేసేదేవుంటాది? దిగమింగుకుని పోతావుండాల." చెంగుతో కళ్లు తుడుచుకుని వెంబడించింది దుగ్గమ్మ. కొంతదూరం పోయేసరికి తలమీద తుండుగుడ్డ కప్పుకుని ఎవరో వ్యక్తి ఎదురు వచ్చాడు. వీళ్ళనుచూసి కొంచెంఆగి, "ఎవరది! దుగ్గమ్మా........"అన్నాడు. "నేనే తాతా......."అంది దుగ్గమ్మ.

"అన్నతో యెళ్లిపోతుతన్నావన్నమాట.కానీ!....సేసేదేవుంది?"అని యింకా ఏమిటేమిటో గొణుక్కుంటూ వెళ్ళాడు. ఊరుదాటే సరికి కొద్దికొద్దిగా తెల్లవారుతోంది. చింతలచెరువు దగ్గరకు వస్తోంది. చెరువుచుట్టు వున్న చింతగుబుర్లమీద నిద్ర లేచిన పక్షులు కోలాహలంగా అరుస్తున్నాయి.అక్కడ వున్నతాడిచెట్లు యిదేమీ పట్టనట్లు ఠీవిగా ఆకాశంలోకి చూస్తున్నాయి. చెరువుగట్టుమీది గంగరావి చెట్టు పండుటాకులన్నీ రాల్చేసి మొండిగా నిల్చునుంది. రాలిపోయిన ఆకులు ఎండి,ఈదురుగాలికి గలగల లాడుతూ కొట్టుకు పోతున్నాయి.

* * *

ఆచెట్టునుచూస్తూ ముందుకు నడిచింది దుగ్గమ్మ. కొట్టుకుపోతున్న ఆకులను చూస్తుంటే తనను నారయ్య కాపిరానికి తీసుకొచ్చుకుంటున్న రోజు గుర్తుకు వచ్చింది.

ఆరోజు పట్నంనుంచి నడిచి నడిచి అక్కడికి వచ్చేసరికి, నారయ్య అన్నాడు," ఈసెరువూ,తోపూ సూశావంటే పిల్లా! మీపట్నంలో యాడయినా ఒక్కుంటుందా యిట్టాంటిది. యీడనే బువ్వ తిని వూళ్లోకి పోదాం" అంటూ గట్టెక్కి కర్రకు తగిలించిన అన్నంమూటసంచి గంగరావిచెట్టుక్రింద పెట్టాడు. తరువాత యిద్దరూ చెరువులో కాళ్ళూ చేతులు కడుక్కొని అన్నానికి కూర్చున్నారు. తను ప్రక్కనే రాలిపడివున్న రెండుగంగరావి పూలుఏరి "యియ్యి తల్లో పెట్టుకోనా" అంటే, "అయ్యేందుకే నీకు. తోటలో గులాబంటు పెంచుతున్నాను గెందా, నువ్వొచ్చేయాలకి పుయ్యాలని" అని నవ్వి అన్నంమూట తనముందుకు నెట్టి సంచిలోనుండి రెండు పొట్లాలు తీశాడు. తనుమూటవిప్పి రెండాకుల్లోను అన్నంపెట్టి ఒకటి అతని ముందు వుంచింది. నారయ్య ఒకపొట్లంలో నుంచి జిలేబి తీసి తన అన్నంమీద పెడుతూ , "యియ్యాల ఇద్దరం కలిసి వనలచ్చిమికాడ బువ్వ తింటున్నాం. బతుకంతా యిట్టాగే తియ్యగా యెళ్లిపోవాలని కోరుకో" అన్నాడు. దుగ్గమ్మ అతన్ని చూసి చిరునవ్వు నవ్వి, "మరి ఆ మెరపకాయ బజ్జిల్లాగా కారం పుడితే ఎట్టమావా?"అని అడిగింది.

"అదేందే ఎర్రిమొగవా. అపుడపుడట్టా కారం తగలోపోతే తీపికి రుచేడి నుంచొస్తదే?"

"అపుడపుడేకాదు. బతుకంతా కారమే సేసి పోయిండు" అనుకుంది దుగ్గమ్మ.

తరువాత అన్నంతిని చెరువులో నీళ్ల త్రాగి వూళ్లోకి నడిచారు. మొదట్లోనే యిద్దరుముగ్గురు మనుష్యులు ఎదురై సరదాగా నవ్వుతూ పలకరించారు. ఊడల మర్రి దగ్గరకు వెళ్లేసరికి ఎవరో ఇరవై ఏళ్ల యువకుడు, గ్లాస్కో పంచ, లాల్చీ వేసుకుని, చేతిలో ఏదో పత్రిక పట్టుకుని వీళ్ల వైపు చూసి నవ్వుతూ నిలుచుని వున్నాడు. దగ్గరకు వెళ్లగానే, "ఏరా నారయ్యా!తెల్లవారక ముందే జంటగా వూళ్లోకి వచ్చి పడ్డావ్.బస్తీలో వూపిరాడ లే దేంటి? సరేగాని... ముందు మనింటికి పోయి తర్వాతే నీ యింటికి వెళ్లు. నే నట్లా తోటకుపోయి వస్తా" అని దుగ్గమ్మను చూసి ఒక నవ్వు నవ్వేసి వెళ్లిపోయాడు. అతడు

వెళ్లిపోయింతర్వాత నారయ్యా తన వైపు తిరిగి, "ఎవరో తెలుసా" అని గర్వంగా అడిగాడు.

దుగ్గమ్మ నవ్వుతూ, "నా కెట్ట తెలుస్తది?' అంది.

"అవును. నీకెట్ట తెలుస్తది? మా సిన్నయ్య డాకటేరుకి సదువు తున్నాడు. ఇంకా రెండు మూడే ళ్లకి అయిపోద్దంట. ఈ వూరు మొత్తంమీద అట్టాంటి కుర్రాణ్ణి సూపు. సదువులో పస్టు. సెలవుమీన ఇంటికొస్తే, ఒక్కగంట యింటో వుండడు. తోటలోనో, సావిడి దగ్గరో, పొలాల్లో దిబ్బల మీనో, ఎక్కడో అక్కడ పని సూసుకుంటా వుండాల్సిందే. ఒక్కడైతే మాత్తరంవేం? పెద్ద య్యకి దిగుల్లేని కొడుకు.....అదిగో. ఎల్లేసిన సిమ్మాల పెహరీ డాబ...అదే మన కామందుది. బూషయ్య గారంటే గొప్ప ఆస్తి లేకపోయినా, సుట్టుపక్కల పేరు మోసిన రైతులే."

గేటు తలుపు తీసుకుని లోపలికి పోయేసరికి డాబా ముందు బటానీ పూల పందిరి కన్పించింది. పందిరంతా పూలు గుత్తులు గుత్తులుగా విరిసిపోయి వున్నాయి. వాటిని చూస్తూ వరండాలోకి నడిచింది దుగ్గమ్మ. లోపలి నుంచి పెద్దమ్మ, సుగుణమ్మ వచ్చారు తామిద్దరినీ చూసి.

పెద్దమ్మ నారయ్యను చూసి నవ్వుతూ, "ఏరా నారయ్యా. నీకంటే నీ పెళ్లామే అందంగా వుంది కదరా, ఎలా చేసుకుంది నిన్ను?" అని అడిగింది. ఆ మాటలకు సుగుణమ్మ పకపకా నవ్వుతుంటే తను సిగ్గుతో ముడుచుకుపోయింది. దానికి నారయ్య కూడ నవ్వి, "నాలాటి వోడే దొరక్క శానరోజుల నించి ఎదురు సూత్తందంటమ్మా. దారి పొడుగునా ఆ సంగతే సెప్పింది" అన్నాడు తనను కోరగా చూస్తూ.

ఈ నవ్వుల్లో భూషయ్య లోపలినుండి వుత్తరీయం కప్పుకుంటూ వచ్చాడు. "ఏరోయ్! పక్కనే పెళ్లాన్ని చూడగానే నీకూ సరసాలు వస్తు

న్నాయేఁ'' అని గుబురు మీసాల చాటున ముసిముసిగా నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయాడు.

పెద్దమ్మ, ''వాడికేం నిక్షేపం లాటివాడు. వాడు దొరకటం దాని అదృష్టం....ఇంతకూ నీ పేరే మిటి? చెప్పావుకావు.....'' అడిగింది.

''దుగ్గమ్మ.''

'''నారయ్యా, దుగ్గమ్మ' బాగుంది.. సుగుణా, లోపలికి పోయి అవి తీసుకురా'' అంది పెద్దమ్మ.

సుగుణ ఒక పెద్ద పళ్లెంలో చీర, రవిక గుడ్డ, పసుపు కుంకుమ పొట్లాలు, తాంబూలం పెట్టి తీసుకువచ్చింది. తనను బొట్టు పెట్టుకోమని, అవన్నీ తనచేతి కందిస్తూ, పెద్దమ్మ నవ్వుతూ అంది. ''నారయ్యను జాగ్రత్తగా చూసుకో దుగ్గమ్మా, వాడింతవరకు పసివాడిలా పెరిగాడు ఈ యింట్లో. నీకేం కావలసి వచ్చినా అడిగి తీసుకు వెడుతూవుండు. మొహమాట పడకు. సరే...యింటికి వెళ్లండిరా నారయ్యా...అన్నీ వున్నాయిగా.''

నారయ్య వెనకకు తిరిగి నడుస్తూ, ''అదు రుట్టం అంటే నీదే! యిపుడొచ్చి సంచీడు సరుకు అమ్మగారికాడ కొట్టేసినావు.'' అంటుంటే వెనక వాళ్లిద్దరూ నవ్వుతున్నారు. తనేమీ సిగ్గుతో మాట్లాడలేక గబగబ అడుగు వేసింది.

* * *

తెలతెల వారుతోంది.

భుజాన పడుకున్న పిల్లవాడు మెసలి సన్నగా ఏడుస్తున్నాడు. వాణ్ణి భుజం మార్చి పడుకోబెట్టు కుని ''జో'' కొడుతూ, ''పిల్లల తల్లి, పెద్ద ముత్త యిదువు, పెద్దమ్మ నిండు గుండెతో దీయించి యిచ్చిన పసుపు, కుంకుమ ఏటికి మట్టిలో కలిసిపోనాయి?'' అనుకుంది. ముందు నడుస్తున్న వీరన్న, ''ఈడే తెల్లారి పోనాది. ఇంకా కోసున్నరపైమాటే పోవాల. కొంచెం సురుగ్గా నడు దుగ్గమ్మా'' అన్నాడు.

* * *

తర్వాత రెండుమూడు నెలలు ఎలా గడిచాయో తన కసలు గుర్తేలేదు. మెట్టపొలాలమీది పసుపు మొక్కల్లో, నడుమెత్తున లేచిన చెరుకు తోటల్లో, దిబ్బల మీది కూరగాయల పందిళ్ల క్రింద, తోటల మీది నిమ్మవాసనల్లో, రోజులన్నీ పచ్చని అలలలో కరిగిపోయాయి. ఈ కొద్దిరోజులలోను నారయ్యతో గొడ్ల దగ్గర పనులు చూడటం, పాలు పితకటం, నిమ్మ తోటనుంచి పచ్చిగడ్డి కోసుకురావటం లాటి వన్నీ అలవాటు చేసుకుంది.

ఒకసారి ఎప్పుడో, ఆ రోజులలోనే నారయ్యతో కలిసి తనుకూడ గడ్డి కోస్తోంది. వున్నట్టుండి ఎక్కడి నుంచో, మామిడల్లం, మొగలి పూలవాసన గుప్పుమన్నాయి. ఆ వాసన లెక్కడినుంచి వస్తు న్నాయో దుగ్గమ్మ కర్థంకాలేదు. నారయ్య నడి గింది. ''యాడ నుంచి మాఁవా, ఆ వాసనలు? ఈ డేడా అల్లము, మొగిలీ లేవుగా?'' అతను కొడవలితో తోటమూల ఎత్తుగా వున్న పుట్టవైపు చూపుతూ, ''అదుగో, ఆడనుంచి..'' అన్నాడు. అప్పటికి తన కర్థంకాలేదు, ''ఏ వుందాడ? పుట్టేగెందా?''

''ఆఁ. పుట్టే. ఏవుందనుకున్నావు లోన? దేవతాపాముంది. అదెప్పుడు కదిలినా యిట్టా వాస నలు రావాల్సిందే. ఒక పట్టాన మడుసుల కళ్లబడదు. నాకు మాత్తరం యిన్ని సమచ్చరాలకి ఒకే ఒకసారి అగుపడినాది. పెద్దయ్య మాత్తరం శాన సార్లు సూసి నాడంట.'' తనకు ఆశ్చర్యంతోను, భయంతోను నోట మాట రాలేదు.

''మరి రాత్తిరింబవళ్ళుయీడనే తిరుగుతుంటారః! మీకు బయ మేయదా మాఁవా?''

''బయ మెందుకే ఎర్రిమొగమా. పండిపోయిన నాగుబాము మడిసిమొగం సూస్తదా, మడిసికి దాని మీద క్రరెత్తే ధైర్యముంటదా? కల్లబడితే రెండు చేతులెత్తి దణ్ణం పెట్టేయటమే. దాని దారిన అదే బోద్ది. ఇంకా బయ మెందు కుంటది!''

దుగ్గమ్మ కిలాంటి పాములుంటాయని తెలియనన్నా తెలియదు. ఎప్పుడు విననుకూడ లేదు. అందుకే చాల క్రొత్తగా వుంది. తరువాత చాల రోజులు తోటకు వచ్చినపుడల్లా తన దృష్టి ఆ పుట్ట మీదనే పడుతుండేది.

కొద్దిరోజులకు ఎండి బీటలువారిన పంట కాలువలన్నీ కలకల లాడాయి. పొలాల్లోకి క్రొత్త నీళ్లు గల్లగ తన్నుకుంటూ పారుతుంటే, పూళ్లో సందడి పెరిగింది. ఉదయం చద్ది అన్నాలు తిన్నప్పటి నుంచి సాయంత్రం ప్రొద్దువాలిపోయే వరకు, పూళ్లోని చాలమంది ఆడ మగ పొలాల్లోనే వుంటున్నారు.నారయ్య కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయించటంలో మునిగి పోయాడు. మధ్యాహ్నం వేళ దుగ్గమ్మ అన్నం పొలానికి తీసుకు వెళ్తుండేది. ఒకరోజు అన్నం తీసుకు పోయేసరికి భూషయ్య దిబ్బ మీద కూర్చొనివున్నాడు, కూలీలుచేసే పనిని చూస్తూ. దుగ్గమ్మను చూడగానే, "నారయ్య లేడే అమ్మాయ్. నారు చాలేటట్లు లేకపోతే, అబ్బాయి, వాడు కలిసి తాడిపాలెం పోయారిప్పుడే. సాయంత్రానికిగాని రారు. ఏమన్నా అవుసరం అవుతుందేమో...వీలుగా వుంటే నువ్వుకూడ కాలువ వొడ్డున వుండు." అన్నాడు.

తాడిపాలెం పోవటానికి సరయిన దారిలేదు. తాటితోపు లవతల పెద్ద కాలవ ఒడ్డునే, కాలిబాటన పోవాలి. పొలాలకు, కాలువలకు నీళ్లు వస్తే బండ్లు నడవవు. దుగ్గమ్మ సాయంత్రం కాగానే కాలువ ఒడ్డున చేరి నారయ్య కోసం ఎదురు చూస్తూ నిలుచుంది. దూరంగా తుమ్మబీడులో కాలిబాటనే ముందు నారయ్య, వెనక చిన్నయ్య, అప్పుడపుడు కాలవలోకి తొంగి చూసుకుంటూ, వస్తున్నారు.

సూర్యుడు పగలంతా వెలిగి, కందిపోయి ఎర్రబడిన ముఖంతో పశ్చిమాకాశాన్నుంచి నీరసంగా జారి పోతున్నాడు. తడిసిన పొలాలమీదనుంచి వీస్తున్న గాలి శరీరాలకు చల్లగా సోకుతోంది. నారయ్య, చిన్నయ్య కంటే ముందు పరుగెత్తుకొచ్చి, చొక్క విప్పి దుగ్గమ్మ ముందు పడేసి, పంచె బిగించి కట్టుకొని కాలువలోకి దూకాడు. దుగ్గమ్మకేమి అర్థం గాక తెల్లబోయి చూస్తోంది. నారయ్య ఈదుకుంటూ కాలువ మధ్యకు వెళ్లాడు. ప్రవాహానికి వేగంగా కొట్టుకు వస్తున్న నారు మోపు నొకదాన్ని పట్టుకుని మళ్లీ ఈదుకుంటూ ఒడ్డుకు చేరేసరికి, చిన్నయ్య పట్టుకుని పైకి లాగాడు. మళ్లీ రెండవది తెచ్చేసరికి మిగిలిన రెండు చాల ముందరకు కొట్టుకు పోయాయి. ఆ రెంటిని కూడ ఒడ్డుకు చేర్చేసరికి వంద గజాలు దిగువకుపోవలసి వచ్చింది. చిన్నయ్య ఇంకో మనిషిని పంపుతానని పొలంవైపు వెళ్లాడు.

నీళ్లలోనుంచి బయటకు వచ్చి, నడుముకు చేతులు ఆన్చుకుని నిలుచున్న నారయ్య ఒకసారి, దుగ్గమ్మ కళ్లలో కదిలాడు. అతని రెండు బలమైన దండచేతుల మధ్య ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్న అతని రొమ్మును చూస్తూ అలాగే నుంచుంది దుగ్గమ్మ.

నారయ్య దుగ్గమ్మకు దగ్గరగా వచ్చి, "ఏందే వూరికే సూస్తవు? తల తుడుచుకోను కొంగయినా యివ్వకపోతివే?" అంటూ పమిట చెంగందుకుని, తల తుడచుకుంటుంటే, ఆమె హృదయం ఆర్ద్రమయింది. పెదవులపై నిండైన చిరునవ్వుతో, "ఏందయ్యా, మరీ అంత సోలిపోయేపని ఒక్కడివే సేయపోతే, యింకోణ్ణీడ వుండమని సెప్పకపోతివా?" తల తుడుచుకుంటున్న నారయ్య ఒక్క నిమిషం ఆగి, ఆమె కళ్లలోకి చూసి నవ్వి, ఈమద్దె అమ్మాయి పేమ మరీ పెరిగిపోతందే! ఈ మాటే ఆల్లెవరి ముందైన అన్నావంటే మొగం మీన నవ్వుతారు. తెలుసా! యింకేడ అనమాక." అన్నాడు.

తర్వాత కొద్దిరోజులకే నిమ్మతోటలో వేసిన నిట్టాడి యింట్లోకి కాపరం మార్చారు. అంతకు ముందు కాపలావాడు వెళ్లిపోయేసరికి, నారయ్యే తోటలోకి రావలసి వచ్చింది. సామాను మార్చే రోజున దుగ్గమ్మ అంది, "మనం ఒక్కళ్లమే ఎట్టా మావా,

'బిక్కుబిక్కు' మనుకుంటూ ఈ తోటలో వుండేది. రాత్తిళ్లు బయమెయ్యదూ?'' నారయ్య తేలికగా నవ్వేసి, ''మాట మాటకీ బయ మంటావ్, మన మొక్కళ్ళమేనంటే ఈ డుండేది? సుట్టూ తోటల్లో మాత్తరం కాపలావోళ్ళు లేరూ గుడిసె లేసుకుని? ఇంక పైగా పిల్లాజెల్లాతో వుండారు. తెలిసిందా?''

దుగ్గమ్మ అప్పుడలా అందేకాని తర్వాత తనకే హాయనిపించింది. త్రాగి,రాత్రి తెల్లవార్లూ తందనా లాడే సోమయ్య, అయిన దానికి, కానిదానికి కొట్లాడు కునే వాడి సవతులు, రోజంతా ఆకలంటూ ఏడ్చే వెనకింటి నరసమ్మ పిల్లలు, పల్లెలో లాగ యిక్క డెవరూ లేరు. ఆ మరునాడంతా తనకు, నారయ్యకు తోటంతా నీళ్లు పెట్టడమే సరిపోయింది. మధ్యాహ్నమే పచ్చగడ్డి కూడ కోసి సావిడి దగ్గర పడేసి వచ్చాడు నారయ్య. అతడొచ్చే సరికి దుగ్గమ్మ స్నానం చేసి, బయట చాప వేసుకు కూర్చుని జడవేసు కుంటోంది. నారయ్య వచ్చి, ''హమ్మయ్య'' అంటూ ప్రక్కనే చాప మీద పడుకున్నాడు.

ఎదురు డొంకమీది చింతచెట్టు తొర్రలో నుంచి రెండు రామచిలుక పిల్లలు బయటికి వచ్చి నుంచున్నాయి. ''కిర్ కిర్'' మని అరుస్తుంటే అతను తలెత్తి చూశాడు. తల్లి చిలుక ఏహో తెచ్చి, ముక్కుతో పిల్లల నోట్లో పెడుతోంది. దాని జంట చిలక పైకొమ్మమీద నుంచుని చూస్తోంది. పిల్లలు రెండు రెక్కలు టపటపా కొట్టుకుంటూ అరుస్తున్నాయి.

నారయ్య అన్నాడు, ''దుగ్గమ్మా, రామసిలక పిల్లల్ని నీ జనమలో ఏనాడన్నా సూసినావంటే?అదుగో కావాలెనంటే అట్టు చూడు. సింతసెట్టు తొర్ర మీన....''

దుగ్గమ్మ అటువైపు చూసింది. పట్టు లాంటి లేత పచ్చరంగులో, కెంపుల వలె ఎర్రని ముక్కులతో, తల్లి దగ్గర,''కిచకిచ'' మంటున్న ఆ పిల్లల్ని చూస్తుంటే, తన మనసులో ఏదో భావం మెదిలి, పెదవుల మీద చిరునవ్వుయింది. అలాగే చిరునవ్వుతో గమనిస్తున్న దుగ్గమ్మను చూసి, ''అంతసేపు సూడ మాకే. దిస్టి తగులుద్ది పిల్లలికి.'' అన్నాడు నారయ్య.

దుగ్గమ్మకేమి సమాధానం చెప్పాలో తోచ లేదు. అలాగే నవ్వుతూ అతని వైపు చూసి, ''దిష్టి కాదు మావా....'' అనిపూర్తిచేయలేక, తలప్రక్కకు తిప్పుకుని చిలిపిగా నవ్వింది.

అతడు ఒక్కక్షణం తెల్లబోయాడు. తరువాత ఏదో తట్టినట్లు ఒక్కసారి లేచి కూర్చుని, ఆమెకు దగ్గరగా జరిగి, ముఖం అతని వైపుకు త్రిప్పుకుంటూ, ''నిజంగానంటే దుగ్గమ్మా? నిజం....?'' అని అడుగుతుంటే తనకింకా సిగ్గు వేసింది. అలాగే నవ్వుతూ తలవూపి లేచిపోబోతుంటే, చేయి పట్టుకుని ఆపి మళ్లీ కూర్చోబెట్టాడు. ఆమె తలొంచుకుని కూర్చోనుంటే, గులాబి పువ్వొకటి తుంచుకువచ్చి తలలో పెడుతూ, ''ఈ పువ్వులాటిపిల్ల కావాలమ్మాయ్ నాకు. మనసులోపెట్టుకునుండు జాగ్రత్తగా.....'' అన్నాడు.

కొంచెంసేపు దుగ్గమ్మ నలాగే చూసి, ''నా అనేది నాకు సేరే నాటికి ఎవురూ లేకుండానే పోయే. అమ్మా, అయ్యా, ఏనాడో నన్నొక్కణ్ణే లోకంలో ఒగ్గేసి పోయారు. మంచీ, సెడ్డ సెప్పేవాళ్లు గూడ లేరు. నేనేం జేసేది దుగ్గమ్మా? ఏం కావాలునుంది నీకు?''

అతని కళ్లలో పలుచని నీటిపొర తిరిగింది. దానిని చూసి చలించిపోయింది దుగ్గమ్మ. అతని దగ్గరకు జరిగి, ''ఎందుకంత బాధ పడతావు? ఇప్పుడేటి తక్కువైనాది మనకి.నువ్విట్టనేవుంటే యింకేటి కావాల నాకు? లేనిపోని దిగుళ్లన్నీ మనసులో పెట్టుకోమాకు'' అంటూ ఓదార్చింది.

ఋతుచక్రం తిరుగుతోంది. గుబుళ్లు చేసిన వరిచేలు యీని, కుంకులు పాలు పోసుకుని నెమ్మ

దిగా పండిపోతున్నాయి. ఆరోజు పుదయం దుగ్గమ్మ బియ్యం చెరుగుతూ కూర్చునుంది. నారయ్య నిమ్మ చెట్టు నీడలో చాప వేసుకుని, నిమ్మ పిందెలు చూస్తూ పడుకున్నాడు. తనకప్పుడే పనీపాటల్లో కొద్దికొద్దిగా ఆయాసం వస్తోంది. ఏదో ఆలోచిస్తూ వడ్లగింజలు ఏరుతుంటే కళ్లముందు నీడ కన్పించింది. ఎవరోనని తలెత్తి చూసేసరికి, పిల్లవాణ్ణెత్తుకుని మల్లి నవ్వుతూ నుంచునుంది. వెనక వీరన్న సంచిపట్టుకుని వస్తున్నాడు. తనకు ఆశ్చర్యంతో, ఆనందంతో మనసు గంతులు వేసింది. లేచి వదినను కావిలించుకుని, "ఎట్టొచ్చినావొదినా? దారి తప్పలేదుగెందా? ఈ నాటికి నన్ను సూడొచ్చినావు!" అంటుంటే, ఎందుకో తనకే తెలియకుండా కళ్లలో నీళ్లు తిరిగాయి. వదిన చేతుల్లోంచి పిల్లవాణ్ణి తను తీసుకుంటూ వుంటే, మల్లి అడిగింది, "ఒంటో ఎట్టుంది దుగ్గమ్మా? తేలిగ్గనే వుంటాదిలే, భారమైన పనేముంటాది గనుక. మేం వొస్తమని నారయ్యన్న సెప్పలేదా? సూడంగనే అంత ఎగిరి పడితివి?" దుగ్గమ్మ నారయ్య వైపు చూసింది. వీరన్న అతని ప్రక్కనే కూర్చుని నవ్వుతూ ఏదో చెప్తున్నాడు. నారయ్య ఆమె వైపొకసారి చూసి కనుబొమ్మ లెగరవేసి మళ్లీ అటువైపు తిరిగాడు.

"మొన్న ఉలవలకి పట్నంబోయి చే సొచ్చిన పని యిదన్నమాట. మరి 'మా అన్నకాడికి పోయొస్తివా మావా' అంటే, 'యాడ తీరనేలే' దన్నడు. నంగనాసిలాగ ఎలా దాసినాడో సూడు" అని దుగ్గమ్మ అంటూ వుంటే, మల్లి ముచ్చటపడింది.

ఆ రోజు సాయంత్రం వీరన్న, నారయ్యతో చెరుకు తోటలు చూడటానికి వెళ్లాడు. సాయంకాలపు నీరెండలో తామిద్దరూ కూర్చుని వున్నారు. మల్లి లోపలికి వెళ్లి తాను తెచ్చిన సంచీ తెచ్చి దానిలోనుంచి కుంకం తీసి తనకు బొట్టుపెట్టింది. తరువాత చీర, రవిక గుడ్డ, అరటిపళ్లు, మిఠాయిపొట్లాలు తన ఒళ్లోపెట్టి, తన బుగ్గలు స్పృశించి, "నెలలు తిరిగే సరికి పండంటి పిల్లని కనోపోతే నే నూరుకుండేదిలేదు దుగ్గమ్మా. మళ్లీ నేసెప్పలేదనుకునేవ్' అంటూ అరటి పండొకటి ఒలిచి తన చేతిలో పెట్టింది.

మల్లి చూపే ఆదరణకు, ఆప్యాయతకు దుగ్గమ్మ మనసు నిండిపోయింది. మల్లి చేతులు పట్టుకుని, "యిపుడింత కర్చు ఏటికి పెట్టినావొదినా? అన్నతో నీ వొచ్చి, నా ముకాన బొట్టుపెట్టి పోతే సాలదా, ఏటికి తెచ్చినావి యిన్నీ?" అంది.

"ఏటికి తెచ్చేదేందే పిచ్చిపిల్లా! అమ్మేపు, అబ్బేపు ఎవరూలేని నాలాటి దౌర్భాగ్యాలకి, అచ్చటా ముచ్చటా జరిగేదెటూలేదు. నీకేం తక్కువైనాది? ముసిలో, ముతకో అమ్మ, ఇద్దరన్నలు, వొదిన్నూ నేను వుండంగా నీకెందుకు జర క్కుండాపోవాలి? తొలి సూలయినా, మలి సూలయినా, పది రూపాయలు అన్నా వొదినా పెట్టరనుకుంటివా?" అని మల్లి అంటూ వుంటే, దుగ్గమ్మ వదినముందు పసిపిల్లలా అయిపోయింది.

అప్పుడు లేచి పాకతలుపు దగ్గరకు లాగి, తాళం వేసి, నిమ్మతోటగుండ బయలుదేరారు. కూరల పాదులు, పసుపు చేలు, చెరుకుతోటలు, కంకుల బరువుతో వాలుతున్నవరిచేలు వదినకు చూపి తిరిగి వచ్చేసరికి మసకమసగ్గా చీకటి పడుతోంది. మల్లి పిల్లవాణ్ణి మంచంమీద పడుకోబెట్టి, మంచానికి జారగిలబడుతూ, "పచ్చగా సెట్లూ, సేల మద్దెలో పని సూసుకుంటూ, వున్నదేదో తింటూ, బాదా బలగమూ లేకుండ ఈడుంటవమే సుక మమ్మాయ్. కిందో మీదో పడి ఒకటిరెండు కుంటలు సంపాదించుకున్నరంటే, యికమీకు దిగుల్లేకుండ జరిగిపోద్ది. మనసులో పెట్టుకో" అని తన అదృష్టాన్ని పొగడుతుంటే కొంచెం గర్వంకూడ కలిగింది దుగ్గమ్మకు.

దుగ్గమ్మ, నారయ్య ఎంత బ్రతిమిలాడినా వినకుండ, మరునాడు చీకటితోనే మల్లి, వీరన్నలు బయలుదేరారు, ముసలి అత్త ఒకతే ఉందని. వెళ్తూ, వెళ్తూ మల్లి చెప్పింది, "నీ కెపుడు బరువుగా వుందను

కుంటే అపుడాడ కొచ్చేయి. లేపోతే కబురంపు, మేమొస్తాం. జాగర్తగుండు, బరువు పనులేమీ సేయమాక.''

శివర్రాత్రి దగ్గరకు వస్తోంది. చలి, మంచు నెమ్మది నెమ్మదిగా వెనక బడుతున్నాయి. వరిచేలన్నీ నూర్పులు గూడ అయిపోయి, పొలాలు బీళ్లలాగ కన్పిస్తున్నాయి. కళ్లాల్లోని ఎండుగడ్డి తోలుకు వచ్చి, వాములు వేయటంతోనే నారయ్యకు వారం రోజులనుంచి పరిపోయింది. అది పూర్తవుతూనే చెరుకుతోట గానుగ ఆడించి, బెల్లం వండాలని, భూషయ్య తొందరపడ్డాడు. చెరుకు కొట్టి గానుగ దగ్గరకు చేర్పించటంతో నారయ్యకు క్షణంతీరటంలేదు.

ఆరోజు మధ్యాహ్నం నారయ్య అన్నానికి వచ్చినపుడు దుగ్గమ్మ చెప్పింది, ''నాకు కొంచెం అను మానంగా వుండది మాఁవా. నే నాడకు బోయేకంటె ఈడుంటేనే సుకం గుంటది. ని స్నీడ పనిలో వొదిలి నే నేడ బోయేది? నువ్వెల్లి మాపటేలకి వొదిన్నన్న వెంటబెట్టుకరా. మా అమ్మ లేసి తిరుగుతందో, లేదో, వత్తానంటే తీసుకరా''

నారయ్య నాలుగు మెతుకులు నోట్లో వేసు కుని, భూషయ్యగారికి చెప్పి సట్నం పరుగెత్తాడు.

చీకటి పడేసరికి దుగ్గమ్మ పని ముగించుకుని, దీపం వెలిగించి పాకలో పెట్టి, బయట మంచం వాల్చుకుని వదిన, నారయ్యల కోసం ఎదురు చూస్తూ పడుకుంది.

పంచమిచంద్రుడి వెన్నెల తోటలో నిమ్మల మీద పలుచగా పరుచుకుంది. ఉండి ఉండి సన్నగా గాలి వీస్తోంది. ప్రక్క తోటలోని యానాది హనుమాయి పిల్లలు అన్నాలు తింటున్నారులా వుంది, పెద్దగా ఏడుస్తున్నారు. డొంక చివరి ముసలి రావిచెట్టుమీది కబోది పక్షులు పెద్దగా అరచి, రెక్కలు కొట్టుకుంటూ లేచి, ఆకాశంలో వలయాలుగా తిరిగి మళ్లీ చెట్టు దగ్గరకు చేరుతున్నాయి.

డొంకమీద అడగొంతుక వినిపించగానే లేచి కూర్చుంది దుగ్గమ్మ. నారయ్య, మల్లి తోట లోకి వస్తున్నారు. దగ్గరకు రాగానే మల్లి అడిగింది, ''ఎట్టాగుంది దుగ్గమ్మా. నారయ్యన్న శాన గాబరా పెట్టేసిం డనుకో. ఊపిరి సలుపుకోనీలేదు. పిల్లా ణ్ణెత్తుకుని అట్టాగొచ్చేసినా.''

''సాయంత్రపేల నుండి తీపు లెక్కువవు తున్నట్టుండాది వొదినా. అన్న రాలేదేం?''

''అన్నచ్చేంజేస్తడు? రేపోమాపో వచ్చి చూసి పోతడులే. అత్తను సూడద్దూ''

నారయ్య లోపలికి పోయి మంచినీళ్లుతాగి వచ్చాడు. ''నే పోయి మునెమ్మకు సెప్పొస్తానే. ఈ రేత్తిరి కీడనే తొంగోమని సెప్పనా?''

''అట్టాగే రమ్మని సెప్పు'' అంది మల్లి.

తలకు గుడ్డ చుట్టుకుని, కఱ్ఱ తీసుకొని పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వూరివైపు వెళ్లిపోయాడు నారయ్య.

* * * *

మల్లి ఆ రోజు ఉదయమే వెళ్లిపోయింది. వీరన్న వచ్చి మేనల్లుడినిచూసి, మల్లిని తీసుకువెళ్లాడు. ఆ సాయంత్రం పిల్లవాడు నిద్రపోతుంటే వూరికే కూర్చు నుంది దుగ్గమ్మ. నారయ్య రాగానే,కొడుకును ముఖంలో ముఖంపెట్టి ఒకసారి చూసుకుని, ''ఇయ్యాలకూడ అడిగిందే పెద్దమ్మ. 'నీ కొడుకుని తెచ్చిచూపవేరా' అని; సూగుణమ్మగూడ అంది. మల్లీ యుగ తీరదుగెందా'' అన్నాడు.

''ఏంది! తీరక పోయేదేంది?''

''ఇగ మాకెట్ట తీరుద్దనుకున్నావే? రేపు నికరం జేసుకుని తాంబూలా లిచ్చేసుగోటం, మల్లా వారం తిరిగేసరికి లగ్గం......సుగుణమ్మకు పెళ్లి చేస్తన్నాంగదా!'' అంటూ ఎదురుగా కూర్చున్నాడు. దుగ్గమ్మ విప్పారిన మొహంతో అతన్ని చూస్తూ ఉండి పోయింది.

"సుగుణమ్మకి సమందం చూశారా! ఆ అబ్బాయి ఏం సేస్తున్నాడంట?"

"ఏం జేస్తున్నాడనుకున్నావ్? సిన్నమ్మకిఅట్టాంటి యిట్టాంటివాణ్ణి ఎట్టా తెస్తామే! మా సిన్నయ్య డాకటరు అవుతున్నాడు. ఇంటికొచ్చే అల్లుడు యింజనీరు కాపోతే ఎట్టా? అదేదో ఉత్తరదేశంలో రైలింజన్ల ప్యాక్టరీలో సేత్తన్నాడంట. పెద్ద ఓదావున్న ఉద్యోగంలే. మరి నీ సంగతేంది? రేపొద్దున తీసుకురమ్మని పెద్దమ్మ మరీ మరీ సెప్పింది...." అంటూ ఉత్సాహంగా చెప్పుకొచ్చేడు నారయ్య.

మరునాడు పిల్లవాణ్ణెత్తుకుని భూషయ్యగారింటికి వెళ్ళివస్తుంటే, దుగ్గమ్మకు సంవత్సరంక్రిందట తాను కాపరానికి వచ్చినరోజు గుర్తుకువచ్చింది. ఆరోజున గూడ నారయ్య ఇలాగే ముందు నడుస్తున్నాడు. అతని వెనుకనే నడుస్తూ, తనుండబోయే యిల్లు ఎలా ఉంటుందో, తనొక్కతే ఎలా ఉండాలో తలుచుకొని ఆందోళన, సిగ్గు పడింది. కాని సంవత్సరం తిరిగేసరికి, తన కిది చాల పాత వూరయినట్టు, ఏనాడో ఈ గడ్డమీదేపుట్టి, ఈ గడ్డమీదే పెరిగినట్లు, నారయ్యతో తన బంధం ఎంతో పురాతనమయినట్లు అనిపిస్తోంది. ఆరోజు యిక్కడికి తనెలా వచ్చిందో, ఈరోజు సుగుణమ్మ, ఎక్కడికో తనెన్నడూ చూడనిచోటికి ఎరుగని మనుష్యులమధ్యకు వెళ్తుంది.

"సల్లని మనసు, సల్లని సేతులున్న తల్లి సుకం గుండక ఏమవుద్ది? దేవుడు సల్లగ సూడకేంజేస్తడు" అనుకుని నిట్టూర్చింది.

నారయ్య వెనుకకు తిరిగిచూసి, "ఏందే అంత పెద్ద ఆలోచనలో పడిపోతివి?" అన్నాడు.

"ఏందోమావా! సుగుణమ్మ పెళ్ళంటుంటే, ఎళ్లిపోతది గెందా అని నాకు దిగులేస్తంది."

"నీకు దిగులేస్తే ఏమే? ఇంకో అదురుష్టమంతుడి పేనం ఆయిన పడుద్ది. నువు రాంగనే నా బతుకు సుకాన పడలా! అంతే!" అంటూ నవ్వాడు నారయ్య.

అలాగే పదిహేనురోజులు తిరిగేసరికి, పెళ్ళికొడుకు సుగుణమ్మను తీసుకుని వెళ్ళిపోయాడు. తరువాత తనూ, నారయ్య పిల్లవాణ్ణి చూసుకుంటూ తమ పనుల్లో పడిపోయారు.

మళ్ళీ కాలం చక్రంలాగే తిరిగిపోయింది. ఎండిపోయి,నెరెలువిచ్చిన పొలాలమీద వాన జలజలా రాలింది. కాలువల గట్లు ఎగతన్నుకుంటూ క్రొత్త నీళ్ళు పరుగులెత్తాయి. ఇంకొకసారి వూరిచుట్టూ పొలాలన్నీ నీటిమయమై, గాలిని చల్లగాచేసి వూరిమీదకు పంపించాయి. మాగాణుల్లో వరిచేలు, మెట్టలమీది తోటలు, నీటితోపాటు పచ్చదనాన్నికూడ పుంజుకుని వనదేవత పట్టుచీరలా మెరిశాయి. యవ్వనాన్ని ధారవోసి మాతృత్వాన్ని పొందిన స్త్రీలా పసుపురంగుకు తిరిగిన వరిచేలు, కంకులబరువుతో తలలు వంచాయి. చిగురు మత్తుగా తిని, కోయిలలు చింతతోపులలోనుంచి కూశాయి.

వనలక్ష్మితోపాటు, కొడుకు ఆట పాటలు కూడ చూసుకుంటుంటే మళ్ళీ సంవత్సరం ఎలా తిరిగిపోయిందో దుగ్గమ్మకు తెలియనేలేదు.

పది పదిహేను రోజులక్రిందటివరకు ఉరుకులు, పరుగులుగా సాగినకాలం, ఆరోజు స్తంభించిపోయినట్లయింది. స్వేచ్ఛగా మైదానంలో ప్రవహిస్తున్న సెలయేరు, ఏ పర్వత పాదానికో తగిలి, బాధతో ఘోషించినట్లు, దుగ్గమ్మ కూడ ఆరోజు ఆక్రోశించింది. సెలయేరు ప్రవాహములో మలుపు తిరిగినట్లు, ఆమె జీవితంలోగూడ మరో అధ్యాయం మొదలయింది. ఆరోజు ఆరుబయట మంచంవేసుకుని పిల్లవాణ్ణి పక్కలో పడుకోబెట్టుకుని నారయ్యకోసం ఎదురు చూస్తోంది. అరటిచెట్ల దిబ్బమీద పచ్చిగడ్డికోసి, సావిట్లో పడేసివస్తానని వెళ్ళిన నారయ్య యింకా రాలేదు. ఏదేదో ఆలోచించుకుంటూ పడుకునుంటే రెండోపాలేరు వేంకట్రాదిహడావిడిగా పరుగెత్తుకుంటూ వచ్చాడు. వచ్చీరాగానే, "నారయ్యను దిబ్బమీద పురుగు ముట్టింది. తెలివి ఆగి ఆగి వస్తుంది

నరసిమ్మయ్యగారింటికాడ మంత్రానికిదించొచ్చినాం. పోదాం పద'' అన్నాడు.

నారయ్యను పురుగు ముట్టింౘా?

తను నిర్విణ్ణురాలయింది. కాళ్ళక్రింది నేల జరజర పాములాగ పరుగెత్తుతున్నట్లనిపించింది. వేంకటాద్రి చెబుతోంది కలలోనో, నిజంగా యిలలోనో అర్థం కాలేదు.

సుకరంగాచేసేయాత్రలో యిదొక కంటకావృత మైన ప్రదేశం కాకూడదూ!

ఆదమరిచి సుఖంగా నిదురించే రాత్రిలో యిదొక పీడకల కాకూడదూ!

కాని అదేదీ కాలేదు. వేంకటాద్రి ఎదురుగా చూస్తూ నిలుచున్నాడు. తాను యాంత్రికంగా లేచి పిల్లవాణ్ణి ఎత్తుకుని, అతనివెంట నడిచింది. నరసింహయ్యగారింటిముందు, తిరగవేసిన నులకమంచం మీద నారయ్యను పడుకోబెట్టారు. ఆమె అతని దగ్గరకు నడించింది. అతని మెడలో గుడ్డ పీలిక దండ వేసివుంది. నోట్లోనుంచి చొంగ, నురుగు కారి మంచం తడిసింది. బిగతీసుకుపోయినట్లున్న నారయ్యను చూడ గానే తను వెర్రిగా కేకవేసి, అతనిమీద పడిపో యింది. ప్రక్కనేవున్న ఎవరో పిల్లవాణ్ణి తీసుకున్నారు. తరువాతంతా ఏమయిందో తనకు తెలియదుగాని, నరసింహయ్యగారు, ''అంతా మించిపోయింది, భూషయ్య, ఇక్కడకు తీసుకువచ్చేసరికి చాల ఆలస్యమయిపోయింది'' అంటుంటే తనకు తెలిసింది. తాను భూషయ్యగారి కాళ్లు కావిలించుకుని ''ఎట్టాగైనా నావోణ్ణి బతికించండయ్యగారూ'' అని రోదిస్తుంటే, ఉత్త రీయంతో కన్ను లొత్తుకోవటం తప్ప, ఏమీ చేయలేక పోయా డాయన. తరువాత నరసమ్మ, వేంకటాద్రి భార్య తన పిల్లవాణ్ణి ఎత్తుకుని, తనను నడిపించు కుంటూ యింటికి తీసుకువచ్చారు.

మరునా డుదయం తనకు మెలకువ వచ్చేసరికి వీరన్న, తల్లి, మల్లోదిన అందరూ కన్పించారు. పది రోజులుండి సామానంతా తీసుకుని పట్నం వెళ్లిపో యారు. తను, అన్నమాత్రం ఈరోజువరకు మిగిలి పోయారు.

క్రిందటిరోజు సాయంత్రం భూషయ్యగారు, చిన్నయ్యకలిసి తోటలోకి వచ్చారు. చాపమీద పడు కున్న తను లేచి నిలబడబోయింది. భూషయ్య, ''లేవకు, కూర్చో దుగ్గమ్మా. మరీ నీరసంగా ఉన్నావ్?'' అంటూ ఎదురుగా నిమ్మపాదు కట్టమీద కూర్చున్నాడు. ప్రక్కనే చిన్నయ్యగూడ కూర్చున్నాడు.

''అయితే దుగ్గమ్మా. రేపు వెళ్లిపోదామను కుంటున్నారుటగా. యిందాక వీరన్న వచ్చిచెప్పాడు.''

తన కళ్లు నీళ్లతో నిండి, ఏమీ మాట్లాడలేక అవునన్నట్లు తలవూపింది.

''నీ కయినవాళ్లంతా అక్కడున్నారుకాబట్టి వెళ్తా వనుకో. కాని నువ్విక్కడే వుండదలుచుకుంటేమాత్రం నాకేమి అభ్యంతరంలేదు. వేంకటాద్రికి రామాయికి కూడ యిక్కడే యిళ్ళేయిస్తాను. వాళ్ళు తోడుం టారు. పనీ పాట చూసుకుంటూ ఉండిపోవచ్చు. నారయ్యనంటే తీసుకురాలేముగాని, నీకు నీ పిల్లవాడికి ఏ లోపము లేకుండ చూడగలం. ఇంకో విషయం...... వాడు నీ కెపుడైన చెప్పాడో లేదోగాని, వాడి సాలు జీతాలు నా దగ్గిరే ఉంచుతూ వచ్చాడు. కావలసి వచ్చి నపుడు తీసుకుని వాడుకున్నా, యింకా పదిహేను వందల రూపాయలవరకువుంది. నేను మిగతా అయిదువందల కలిపి యిస్తున్నాను. ఇదుగో, తీసుకోరా వీరన్నా'' అని చేతి సంచీలో వున్న పొట్లాం తీసి యివ్వబోయాడు. వీరన్న దుగ్గమ్మను చూస్తు వూరుకున్నాడు. దుగ్గమ్మ అంది, ''యిప్పు డా పైకమంతా పట్టుకపోయి యాడ పెట్టుకుంటా మయ్యగారూ. కర్చులకి ఓ వంద రూపాయ లీయండి. అవసర మెచ్చినపుడు వచ్చి తీసుక పోతాము.''

''అదే బాగుంటుందయ్యా. మీా కాడే ఉండ నిండి. ఏం సేత్తే బాగుంటుందో తేల్చుకున్నపుడు, అపుడే తీసుకోవచ్చు'' అన్నాడు వీరయ్య.

భూషయ్య వంద రూపాయలు విడిగా తీసి వీరన్న కిచ్చి, ''ఆలోచించుకో అమ్మాయ్. నువ్వెపుడు యిక్కడికి రావాలనుకుంటే అపుడే వచ్చేయి. వారే మంటారో అనిమాత్రం పెట్టుకోకు. సరే.....మే మొస్తాం......రేపేగా వెళ్తోంది.......?'' అని లేచి నెమ్మదిగా వెళ్లిపోయారు.

*   *   *

ఉదయపు ఎండ చిటచిటలాడుతోంది. భుజం మీాది పిల్లవాడు లేచి ఏడుస్తున్నాడు. వాణ్ణి జో కొడుతూ తలెత్తి ముందుకు చూసింది. నగరం పొలి మేరలు దగ్గరకువచ్చాయి. సిమెంటు ఫ్యాక్టరీ పొగ గొట్టాలు ఆకాశంలోకి లేచి, పచ్చని పొగతో, ఆకాశాన్ని మలినం చేస్తున్నాయి. మైకుల్లో పాటలు గజిబిజిగా వినిపిస్తున్నాయి. కార్లరొద, హారన్లమోతలు ఆగి ఆగి చెవులకు సోకుతున్నాయి. మళ్లీ అదే జీవితం......

బిలబిలలాడుతూ పరుగులెత్తే మనుషులమధ్యలో, పురుగులను, పశువులను సేదదీర్చే మురుగునీటి ప్రక్కన, చెట్లు చోట్లులేని గుడిసెల్లోకి మళ్లీపోవాలి... మళ్లీ బ్రతకాలి.

దుగ్గమ్మ ''సేసే దేవుంది, ఎటో అటు సాగి పోవాలి గెందా?'' అనుకుంటూ ముందుకు నడిచింది.

——